సాక్షి నిర్మల్

శుక్రవారం । 22 । మార్చి । 2024



ఓటుందా.. సరిచూసుకోండి..!
లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. మే 13న ఎన్నికలు జరగనుంది. గత నెల 8న ఓటరు తుది జాబితా విడుదల చేసింది.
8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర : 6:29	శని : 4:55

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /23.3

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

23, 24 తేదీల్లో మంత్రి సీతక్క పర్యటన

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఈనెల 23, 24 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తారని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. 23న ఉదయం ఖానా పూర్ జేకే ఫంక్షన్ హాల్‌లో, తర్వాత 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్మల్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో, 24న ఉదయం భైంసాలో నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: విశ్రాంత ఉద్యోగుల సంఘం, గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసిన తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని తెలిపారు.

కవిత్వంతో సమాజంలో చైతన్యం

- తెరవే గౌరవ అధ్యక్షుడు దామెర రాములు



మాట్లాడుతున్న డాక్టర్ దామెర రాములు

నిర్మల్‌ఖిల్లా: సమాజాన్ని చైతన్యపరుస్తూ, ప్రజలను జాగృతం చేయడంలో కవిత్వం పాత్ర కీలకమని తెలంగాణ రచయితల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దామెర రాములు అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్మల్ నర్సింగ్ హోమ్‌లోని సాహితీ క్షేత్ర సమావేశ మందిరంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో 'ప్రపంచ కవితా దినోత్సవం' గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవిత్వం లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. కవులు, రచయితలు ఎల్లప్పుడూ ప్రజలపక్షం వహిస్తారని పేర్కొన్నారు. మానవ సంబంధాలను కవిత్వం ద్వారానే వ్యక్తపర్చగలమని, కవి సమాజం కోసం సత్యంవైపు నిలబడి కవిత్వం రాస్తారని వక్తలు వెల్లడించారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, సలహా సభ్యులు పత్తి శివప్రసాద్, కోశాధికారి పోలీస్ భీమేష్, సంపత్, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదు

- డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్:నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవడం ఖాయమని, ఆ పార్టీకి భవిష్యత్తు లేదని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మామడ వైస్ ఎంపీపీ లింగారెడ్డి, ఆరేపల్లి మాజీ సర్పంచ్ అరవింద్‌రావు గురువరాం కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, రాహుల్ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. సామ వికాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, సాయికృష్ణ, సాయినాథ్, భూమన్న పాల్గొన్నారు.



ఈచిత్రంలో కనిపిస్తున్నది నిర్మల్ గొలుసుకట్టు చెరువుల్లో భాగమైన ఇబ్రహీం చెరువు. మంచిర్యాలరోడ్డులో ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎదురుగా ఉంటుంది. విశాలమైన ఈ చెరువు ఇప్పుడు ప్రమాదంలో ఉంది. ఈచెరువుకట్ట మొదలయ్యే ప్రాంతంలోనే కట్టను ఆనుకునే భారీరాళ్లు, మట్టి యంత్రాలతో తవ్వేస్తున్నారు. మరోవైపు ఈ కట్టపొడవునా బఫర్‌జోన్‌లోకి చొచ్చుకువచ్చి వెంచర్లు ఏర్పాటు చేసి నిర్మాణాలను చేపడుతున్నారు. వరుసగా భారీ వరదలతో బలహీనంగా మారిన ఈ చెరువుకట్ట పొడవునా ఇలా చేస్తే.. కట్ట తెగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ఈ చిత్రం నిర్మల్–భైంసారోడ్డులోని మంజులాపూర్ వద్దగల చిన్నచెరువు(రాంసాగర్) కట్ట వద్ద పరిస్థితి. ఒకప్పుడు విశాలంగా ఉన్న ఈ కట్టను ఇప్పుడు ఇష్టారీతిన ఆక్రమించేశారు. కట్టనే తవ్వేస్తూ షెట్టర్లు వేస్తున్నారు. క్రమంగా చిన్నచెరువు కట్టపైకి వెళ్లడానికి దారే లేకుండా చేశారు. ఈ కట్ట పొడవునా బఫర్‌జోన్‌లో నిర్మాణాలను చేపడుతున్నారు.


గొలుసుకట్ట.. తెగేట్టు!



జిల్లాకేంద్రంలోని రాంసాగర్(చిన్నచెరువు) చుట్టూ పరిస్థితి ఇదీ..

- చెరువుల శిఖాల్లో అక్రమ నిర్మాణాలు..
- కట్టలనూ చెక్కుతున్న ఆక్రమణదారులు
- 'బఫర్‌జోన్'లోనూ నిర్మాణాలు
- హైకోర్టు తీర్పు బేఖాతర్
- ప్రమాదంలో చారిత్రక చెరువులు

నిర్మల్: జిల్లా కేంద్రం ప్రమాదంలో ఉందా..? భారీవరదలు వస్తే భయంభయంగా బతకాల్సిందేనా..? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఎందుకంటే నిర్మల్ చుట్టూ ఉన్న చారిత్రక గొలుసుకట్టు చెరువులు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాయి. ప్రమాదకరంగా మారుతున్నాయి. కబ్జాలే ఇందుకు కారణం. ఇప్పటికే గొలుసుకట్టు చెరువుల ఎఫ్‌టీఎల్, శిఖం భూములను ఆక్రమించారు. ఇవి చాలవన్నట్లు ఇప్పుడు చెరువుల కట్టలనూ కబ్జా



నిండుకుండలా ఉన్న ఇబ్రహీం చెరువు

పెడుతున్నారు. వాటిని ఆనుకునే బఫర్‌జోన్‌లో తవ్వకాలు, భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మల్ గొలుసుకట్టు చెరువుల ఆక్రమణలపై రెండేళ్ల క్రితం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులనూ కబ్జాదారులు బేఖాతర్ చేస్తున్నారు.

కట్ట తెగితే ఖతమే..

450 ఏళ్ల క్రితం అప్పటి పాలకులు ప్రజాసంక్షేమం కోసం నిర్మల్ చుట్టూ గొలుసుకట్టు చెరువులను తవ్వించారు. అప్పుడెప్పుడో వాళ్లు చేసిన మంచిపనికి ఇప్పటికీ నిర్మల్‌కు మంచినీటి కష్టం రాలేదు. చుట్టూ ఉన్న ఆర్మూర్, కామారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్ తదితర పట్టణాలన్నీ నీటి సమస్యతో అల్లాడుతుంటే.. నిర్మల్‌లో మాత్రం మండు వేసవిలోనూ గొలుసుకట్టు చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. అలాంటి చెరువులను చెరబట్టి పట్టణానికి ప్రమాదకరంగా మారుస్తున్నారు. శిఖం, ఎఫ్‌టీఎల్ అంటే ఫర్వాలేదు కానీ.. ఏకంగా చెరువుల కట్టలనూ వదలకుండా ఆక్రమిస్తున్న వైనం విస్తుగొలుపుతోంది.

బఫర్‌జోన్ మరిచారా..?

చెరువులతోపాటు చెరువుల కట్టలకూ బఫర్‌జోన్ ఉంటుంది. కేవలం కట్టవరకే దాని పరిధి అనుకుంటే పొరపాటే. ఇరిగేషన్ శాఖలో ఉన్న జీవోల ప్రకారం చెరువుకట్ట మూడున్నర మీటర్ల ఎత్తు ఉంటే, కట్ట నుంచి పదిమీటర్ల వరకు బఫర్‌జోన్‌గా పరిగణిస్తారు. కట్ట ఎత్తు మూడున్నర మీటర్ల కంటే తక్కువగా ఉంటే ఐదుమీటర్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది. జిల్లా కేంద్రంలోని చాలాచెరువులు బఫర్‌జోన్ దాటి కట్టను ఆనుకునే నిర్మాణాలను చేపడుతున్న తీరు చాలా ప్రమాదకరంగా ఉంది. రెండేళ్లగా వరదలతో మునుగుతున్న 'జీఎన్‌ఆర్ కాలనీ ముంపు కథ' మరిచిపోక ముందే.. అలాంటి మరిన్ని ఘటనలు దారితీసే ప్రమాదాలను పెంచుతుండటం స్థానికులకు ఆందోళన కలిగిస్తోంది.

భూముల విలువ పెరగడంతో..

నిర్మల్ జిల్లా కేంద్రమైన తర్వాత రోజురోజుకూ విస్తరిస్తోంది. ఎక్కడెక్కడి నుంచో విద్య, ఉద్యోగ, ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి స్థిరపడుతున్నారు. ఈక్రమంలో పట్టణం మధ్యలో, చుట్టూ ఉన్న చెరువులపై కబ్జారాయుళ్లు కన్నేస్తున్నారు. చెరువుల శిఖాలు, ఎఫ్‌టీఎల్‌లతోపాటు ఇప్పుడు చెరువుల కట్టలు, బఫర్‌జోన్‌లలోనూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు చేస్తున్నారు. భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. వీరివెనుక ప్రజాప్రతినిధులు, పేరున్న రాజకీయ నేతలు ఉండటంతో చర్యలు తీసుకోవాల్సిన అధికారులూ వెనుకడుగేస్తున్నారు. ఈ ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలు స్థానికుల పాలిట ప్రమాదాలుగా మారుతున్నాయి. వీటిపై సంబంధిత అధి కారుల వివరణ కోరగా, ఇలాంటి ఆక్రమణలపై తాము ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని తెలి పారు. హైకోర్టుకూ నిర్మల్ చెరువుల సమాచారాన్ని అందించామని పేర్కొన్నారు.

ఓటు వజ్రాయుధం



ప్లకార్డును ప్రదర్శిస్తున్న కలెక్టర్, విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని ప్రతీ ఓటరు దానిని వినియోగించుకుని ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్న విద్యార్థినులకు పోలింగ్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమన్నారు. ప్రతీ ఓటరు మే 13న విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. యువత తాము ఓటు వేయడమే కాకుండా కుటుంబ సభ్యులు ఓటు వేసేలా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే ఎన్నికల సంఘం నోటా అనే అవకాశం కల్పించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నూతనంగా 7,078 మంది ఓటర్లు తొలిసారి తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఓటింగ్ శాతం పెరగడానికి యువత కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నమూనా ఓటింగ్ మిషిన్ పనితీరును విద్యార్థులు పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఆయా కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

24న నిర్మల్‌కు కోదండరామ్

నిర్మల్‌చైన్‌గేట్:ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల కమిటీ సభ్యులుగా నియమి తులైన ప్రొఫెసర్ కోదండరామ్ ఈనెల 24న నిర్మల్‌కు రానున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న తెలిపారు. పీఆర్సీ, డీఏ, సీపీఎస్, కమ్యూనికేషన్ వాల్యుయేషన్ పెన్షన్ తదితర సమస్యలను కోదండరామ్ దృష్టికి తీసకెళ్లాలని పేర్కొన్నారు. ఆయన ద్వారా నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళతా యని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు పెన్షనర్స్ సంఘ భవన మీటింగ్ హా ల్లో జరిగే సమావేశానికి అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

- కాంగ్రెస్ గూటికి విఠల్‌రెడ్డి
- సీఎం రేవంత్ సమక్షంలో చేరిక
- 'అల్లోల' చేరికపై సందిగ్ధం!

నిర్మల్: బీఆర్‌ఎస్ పార్టీకి జిల్లాలో పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అనేక ఊగిసలాటల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పదేళ్లు ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన కొంతకాలంగా అధికార కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం జరిగింది. చివరకు ఆయన పార్టీ మారడంతో త్వరలోనే ఆయన అనుచరులూ కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది.

సొంత గూటికి..

విఠల్‌రెడ్డి తండ్రి దివంగత గడ్డెన్న కాంగ్రెస్ నేత. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా హస్తం పార్టీని వీడలేదు. రాష్ట్ర మంత్రిగానూ సేవలందించారు. గడ్డెన్న వారసుడిగా కాంగ్రెస్ ద్వారానే విఠల్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. 2006–08 భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేశారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసి 183 ఓట్ల స్వల్పతేడాతో ఓడిపోయారు. 2010–13 వరకు మరోసారి భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేశారు. 2014లో మళ్లీ కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసి రెండోసారి గెలిచారు. 2023 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రామారావుపటేల్ చేతిలో ఓడిపోయారు. అప్పటి నుంచి కొంత ఒత్తిడికి లోనవుతున్న విఠల్‌రెడ్డి అనుచరుల సూచన మేరకు మళ్లీ పాతగూటికి చేరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడే వెళ్లిపోవడంతో బీఆర్‌ఎస్ పరిస్థితి దయనీయంగా తయారైంది.



విఠల్‌రెడ్డి

'అల్లోల' చేరికపై అస్పష్టత..

మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసే విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం సాగింది. కానీ.. అల్లోల కంటే ముందే విఠల్‌రెడ్డి హస్తం కండువా కప్పుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కౌన్సిలర్లు 'అల్లోల'తో సంబంధం లేకుండానే కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి సైతం పలువురు కౌన్సిలర్లు, నాయకులతో చేరేందుకు సిద్ధమయ్యారు. వీరంతా గురువారం చేరేందుకు సిద్ధంకాగా, ఐకేరెడ్డి చేరికపై అస్పష్టత తొలగని కారణంగానే ఆగినట్లు సమాచారం.

విఠల్‌రెడ్డి పోయినా నష్టం లేదు

భైంసాటౌన్: ముధోల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.విఠల్‌రెడ్డి పార్టీని వీడినా నష్టమేమీ లేదని ఆ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి విలాస్‌గాదేవార్ అన్నారు. పట్టణంలో గురువారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం పోరాడిన ఉద్యమ పార్టీ అన్నారు. ఎందరు పార్టీని వీడినా కార్యకర్తలు, ప్రజలు తమవైపే ఉన్నారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఓటమి ఖాయమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికే ప్రజలు పట్టం కడతారని జోస్యం చెప్పారు.

టార్గెట్ 100%

- పన్ను వసూలులో నిర్మల్ బల్దియా దూకుడు
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు
- స్పందించని వారి ఆస్తుల జప్తు
- ఇప్పటివరకు రూ.4.76 కోట్లు వసూలు

నిర్మల్‌టౌన్: మరో పది రోజుల్లో 2023–24 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. దీంతో నిర్మల్ బల్దియా అధికారులు ఆస్తి పన్ను వసూలులో దూకుడు పెంచారు. మార్చి చివరి నాటికి 100 శాతం పన్ను వసూలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో లక్ష్యాన్ని చేరుకునేందుకు మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వందశాతం వసూలుకు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేయడంతోపాటు ఇంటింటికీ బిల్ కలెక్టర్‌ను పంపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా పన్ను చెల్లించే వెసులుబాటు కల్పించారు. మొత్తం 8 బృందాలు పన్ను వసూలు కోసమే పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో బిల్ కలెక్టర్, సహాయకుడు ఉండగా వీరిని రెవెన్యూ అధికారులు, ఆర్వో అనూప్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పన్ను వసూలు విధుల్లోనే ఉంటున్నారు.

500 మందికి రెడ్ నోటీసులు..

పట్టణంలో మొత్తం 42 వార్డులు ఉండగా, నివాస గృహాలు 23,089 ఉన్నాయి. మొత్తం వసూలు కావాల్సిన పన్ను రూ.10.93 కోట్లు. ఇప్పటి వరకు రూ.4.76 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.6.25 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం 43.46 శాతమే వసూలు చేశారు. మరోవైపు మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు అన్ని అస్త్రాలు ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే 500 మందికి రెడ్ నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించని వారి ఆస్తులు జప్తు చేస్తున్నారు. ఈ వారం ప్రియదర్శిని నగర్, గాజుల్‌పేట్ ప్రాంతాల్లో ఆస్తి పన్ను చెల్లించని వారి ఆస్తులు జప్తు చేశారు.



పన్ను కట్టని ఇంటి గేట్ తీసుకెళ్తున్న సిబ్బంది

90 శాతం వడ్డీ మాఫీ..

మొండి బకాయిలను సులువుగా వసూలు చేసేందుకు ప్రభుత్వం వడ్డీ మాఫీ వెసులుబాటు కల్పించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిదారులు పన్నులు చెల్లించక పోవడంతో వాటికి వడ్డీ కలిపి పన్నులను వసూలు చేస్తున్నారు. పెండింగ్ పన్నులపై విధించిన వడ్డీ 90 శాతం మాఫీ చేస్తూ.. రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మొండి బకాయిదారులకు ఊరట లభించింది.

లక్ష్యం సాధించే దిశగా..



ఆస్తి పన్ను వసూళ్లు 100 శాతం సాధించేలా తగిన ప్రణాళికలు రూపొందించాం. ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొండి బకాయిదారుల వివరాల జాబితాను రూపొందించేందుకు తగిన కార్యచరణ సిద్ధం చేశాం. ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ చేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31లోగా పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– సీవీఎస్.రాజు, నిర్మల్ మున్సిపల్ కమిషనర్

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. సారంగాపూర్ మండలం అప్పారావుపేట్–సిర్పెల్లి గ్రామాల మధ్య అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు పరిధిలోని గ్రామాల వివరాలను ఎస్సై చంద్రమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, డబ్బు, ఇతర ఎలాంటి సామగ్రి జిల్లాలోకి ప్రవేశించకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కోడ్ అమలులోకి వచ్చినందున గ్రామాల్లో మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర సాయుధ బలగాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లోకి వచ్చిన నేపథ్యంలో పూర్తిగా ఎన్నికల నియమావళిని అనుసరించే విధానాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ జానకీషర్మిల

అడవులే మనుగడకు ఆధారం

- బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్



మాట్లాడుతున్న సీసీఎఫ్ శరవణన్

నిర్మల్: అడవులే మానవ మనుగడకు ఆధారమని బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్ అన్నారు. సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామ సమీపంలోని గండిరామన్న హరితవనంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి తన అవసరాలకు అనుగుణంగా అడవిని నరికివేస్తూ ప్రకృతి వినాశనానికి పునాదులు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడవులు క్రమేణా తగ్గిపోయి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. కరువులు, అకాల వర్షాలకు అడవుల నరికివేతే కారణమని తెలిపారు. అడవుల పరిరక్షణను అందరూ బాధ్యతగా గుర్తించాలని సూచించారు. అడవులను రక్షిస్తేనే వన్యప్రాణులు రక్షించబడతాయన్నారు. అడవులు, వన్యప్రాణుల రక్షణతో జీవవైవిధ్యం సాధ్యమవుతుందన్నారు. జిల్లా అటవీ అధికారి రామ్‌కిషన్‌యాదవ్, ఎఫ్‌డీవో రవీందర్, ఎఫ్ఆర్వో రమేశ్‌రావు, డీఆర్వో శ్రీదేవి, చించోలి(బి) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

- భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

భైంసారూరల్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ అన్నారు. భైంసా మండల పరిషత్ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికలకు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీ చేయాలన్నారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన ఉండాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించేవారిపై నిఘా ఉంచినట్లు వెల్లడించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద జిల్లాలోకి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయలన్నారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

రెండు మండలాల్లో పంటనష్టం

- జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

భైంసాటౌన్: ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానకు జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే దశలో అకాల వర్షంతో రైతుల కష్టం నేలపాలైంది. ముఖ్యంగా వరి, మొక్కజొన్నతోపాటు నువ్వు పంట వేసిన రైతులు వడగళ్ల వానతో నష్టపోయారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఈ మేరకు నష్టపోయిన పంటల వివరాల కోసం సర్వే చేసి నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని లక్ష్మణచాంద, మామడ మండలాల్లో వరి, మొక్కజొన్న, నువ్వు పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 1,913 ఎకరాల్లో 1,228 మంది రైతులు పంట నష్ట పోయినట్లు ప్రాథమిక అంచనా రూపొందించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్ తెలిపారు.

పంట నష్టం అంచనా ఇలా...

పంట	రైతులు	ఎకరాలు
వరి	73	120
మొక్కజొన్న	473	767
నువ్వులు	682	1,026
మొత్తం	1,228	1,913

క్లుప్తంగా

పాదరక్షలు ధరించిన డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



పాదరక్షలు ధరిస్తున్న శ్రీధర్

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేంత వరకూ పాదరక్షలు ధరించనని ప్రతిజ్ఞ పూనిన డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ తన దీక్షను గురువారం విరమించారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో తన దీక్షను విరమించి పాదరక్షలను ధరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీలో మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణానికి చెందిన ఇర్ఫాన్‌ఖాన్ వద్ద నుంచి రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. భైంసా నుండి నిర్మల్‌కు ఫోర్ వీలర్ వాహనంలో నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన నగదును తదుపరి చర్యల నిమిత్తం సీటీఓ(కలెక్టర్ ఆఫీస్) నిర్మల్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

మట్కా నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో షేక్ రఫీక్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో గురువారం మట్కా నిందితుడిని పట్టుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ రఫీక్ వద్ద రూ.11,100 నగదుతో పాటు మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.


గుడుంబా పట్టివేత

నర్సాపూర్(జి): మండలంలోని బూర్గుపల్లి (జి) గ్రామానికి చెందిన రాథోడ్ గోవింద్ అక్రమంగా తయారుచేసి నిల్వ ఉంచిన రూ.4400 విలువైన 11 లీటర్ల గుడుంబాను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

నిర్మల్: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన సారంగపూర్ మండలంలో చోటు చేసుకుంది. స్వర్ణ గ్రామానికి చెందిన అచ్చ రాజేశ్వర్ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు సమీప బోరుబావుల్లో మోటార్లు ఆన్‌చేసి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఎంఆర్ఐ లక్ష్మీనారాయణ అంచనా వేశారు.

ఓటుందా.. సరిచూసుకోండి..!



- ఏప్రిల్ 15వరకు నమోదుకు అవకాశం

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలిలా...

నియోజకవర్గాలు: 07
(సిర్పూర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముధోల్)

మహిళలు: 8,41,250

పురుషులు: 8,02,267

ఇతరులు: 87

మొత్తం ఓటర్లు: 16,43,604

భైంసాటౌన్(ముధోల్): లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ సైతం ప్రకటించింది. మే 13న ఎన్నికలు జరగనుండగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్–2024)లో భాగంగా గత నెల 8న ఓటరు తుది జాబితా విడుదల చేసింది. ఈ మేరకు తుది జాబితాలో ఓటు ఉందో.. లేదో పరిశీలించుకుని.. లేనిపక్షంలో నమోదు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోనివారు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. నూతనంగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం –8 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా బూత్ లెవల్ అధికారిని సంప్రదించి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో nvsp.in, ceotelangana.nic. in, voters.eci.gov.in వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు ఉందో లేదో సరిచూసుకునేందుకు ఆన్‌లైన్‌లో nvsp.in, ceotelangana.nic.in వెబ్‌సైట్లలో తెలుసుకోవచ్చు.

మొత్తం ఓటర్లు 16.43 లక్షలు

ప్రత్యేక ఓటరు సవరణ తుది జాబితా ప్రకారం ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 16,43,604 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 8,02,267 మంది పురుషులు, 8,41,250 మంది మహిళలు, 87 మంది ఇతరులు ఉన్నారు. ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం సిర్పూర్ మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. దీంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ అభ్యర్థుల జయాపజయాల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. అలాగే అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే నిర్మల్‌లో అత్యధికంగా 2,56,147 మంది ఓటర్లు ఉండగా, తక్కువగా బోథ్‌లో 2,10,915 మంది ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓట్లలోనూ నిర్మల్ 20 ఓట్లతో ముందంజలో ఉండగా, బోథ్‌లో ఇద్దరే ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	1,14,484	1,14,359	12	2,28,855
ఆసిఫాబాద్	1,12,510	1,14,056	16	2,26,582
ఆదిలాబాద్	1,19,154	1,24,375	06	2,43,535
బోథ్	1,02,333	1,08,580	02	2,10,915
నిర్మల్	1,21,070	1,35,057	20	2,56,147
ఖానాపూర్	1,09,508	1,14,445	13	2,23,966
ముధోల్	1,23,208	1,30,378	18	2,53,604





పరీక్షకు హాజరవుతున్న బాలికలు

'ఒంటికీ రెంటికీ' ఇదేం పరీక్ష

పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు లేక ఒంటికి రెంటికీ ఇబ్బందులు పడుతున్నారు. అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్తున్నప్పటికీ జిల్లా కేంద్రంలోని సోమార్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో చూస్తే పరిస్థితి ఇట్టే తెలిసిపోతుంది. తలుపులు విరిగిపోయి, గోడలు కూలిపోయి శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లే ఇందుకు నిదర్శనం. వాటినే అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు వాడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



తలుపులు లేకుండా ఉన్న మరుగుదొడ్డి



శిథిలావస్థలో మరుగుదొడ్లు



పరీక్షకు హాజరవుతున్న బాలురు

నిర్వహణ నిధులేవి?

- నెలల తరబడి విడుదల కాని వైనం
- రైతువేదికల నిర్వహణకు ఇబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్లస్టర్‌కు ఒకటి చొప్పున నిర్మించిన రైతువేదికల నిర్వహణ ప్రశ్నార్థకమైంది. వీటి నిర్వహణకు నిధులు సకాలంలో రాక నిర్వహణ కొరవడింది. సమావేశాలకు ఉన్నతస్థాయి అధికారులు వస్తున్నారంటే రైతువేదికను శుభ్రం చేసేందుకు ప్రైవేట్ కార్మికులకు టీ, టిఫిన్, తాగునీరు, విద్యుత్ బిల్లులకు సంబంధించిన డబ్బులు ఏఈవోలే వెచ్చిస్తున్నారు. ఏఈవోలు పట్టించుకోని చోట అపరిశుభ్రంగా మారాయి. కాగా, ప్రభుత్వం నియోజకవర్గానికో రైతువేదిక ఎంపిక చేసి ఆన్‌లైన్ ద్వారా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో అన్నదాతలకు సూచనలిస్తోంది. ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి, చాందా (టీ), అనుకుంట, యాపల్‌గూడ, అంకోలి, పిప్పల్‌ధరి, ఖండాలో ఏడు, మావల మండలంలో మావల ఒక క్లస్టర్ ఉంది. 2021లో రూ.22లక్షలతో ఒక్కో రైతువేదిక నిర్మించారు. ఇందులో విద్యుత్ బిల్లుకు రూ.వెయ్యి, పారిశుధ్య నిర్వహణకు రూ.3వేలు, రైతుల శిక్షణకు రూ.2,500, తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్సులు, ఇతర ఖర్చులకు రూ.2వేలు కేటాయించారు. ఈ మేరకు గతేడాది ఫిబ్రవరి వరకు నిధులువిడుదల చేసింది. గతేడాది మార్చి నుంచి నిధులు నిలిపివేయడంతో వాటి నిర్వహణ భారమైంది. దీంతో గదులను శుభ్రం చేయించడం, విద్యుత్ బిల్లులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని పలువురు ఏఈవోలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.



యాపల్‌గూడ రైతువేదిక

రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మహేందర్

లోకేశ్వరం: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పసుపు పంట సాగు చేసే రైతులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పసుపు రకాల గురించి ప్రదర్శన ఏర్పాటు చేసి విత్తనాల ఎంపిక, నేల మొక్క సారవంత గుణాన్ని బట్టి ఎంత దిగుబడి వస్తుందని, ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి శాస్త్రవేత్త శ్రీనివాస్, భైంసా ఉద్యానవన అధికారి హర్షవర్ధన్, కంపెనీ చైర్మన్ నాగమణి, వ్యాపా ర విస్తీర్ణ అధికారి అనిల్, సీఈవో మేఘన, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం



మొక్క నాటుతున్న ఆత్రం సక్కు

- బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అటవీ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. పేదల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. టెక్స్‌టైల్ పార్క్, సీసీఐ పునరుద్ధరణ, గిరిజన యూనివర్సిటీపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, బీఆర్ఎస్ నాయకులు స్వరూపరాణి, సాజిద్, ప్రకాష్, నర్సింగ్, భరత్, అష్రఫ్, మోబిన్, విజ్జగిరి నారాయణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి గ్రామాల్లో బుధవారం రాత్రి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం విలు వ రూ.13,690 ఉంటుందన్నారు. పట్టుకున్న వారిలో ఏఎస్సై ముంతాజ్, స్వామి, శివాజీ, సుభాష్, తదితరులు ఉన్నారు.

కుభీర్: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో గురువారం మండలంలోని పార్డి(బి) గ్రా మంలోని ఒక దుకాణంలో తనిఖీ చేయగా అ క్రమంగా నిల్వ ఉంచిన రూ.7,920 విలువైన మద్యం పట్టుబడినట్లు ఎస్సై పీ.రవిందర్ తెలిపారు. మద్యం అమ్ముతున్న ర్యాపన్‌వార్ పాపన్నపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో గురువారం రాత్రి ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు హోటళ్లు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఓ హోటల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.6,844 విలువగల 10 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఏఎస్సై దేవరావు, సిబ్బంది సవిత, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న మద్యంతో ఎస్సై రజనీకాంత్

బెల్టుషాపులపై దాడులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన మరక్వాడ్ సాయికుమార్ గౌడ్, సునీల్, అడ్డివార్ ప్రమోద్ రెడ్డి నిర్వహిస్తున్న బెల్టు షాపులపై వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన 10 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గాంధీనగర్‌కు చెందిన రుక్మా నిర్వహిస్తున్న బెల్టు షాపును తనిఖీ చేసి మూడున్నర లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుందరయ్యనగర్‌కు చెందిన సుధాం బెల్ట్‌షాపుపై దాడి చేసి లీటర్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ముధోల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగుతుంది. మండల కేంద్రంలోని కంటి ఆసుపత్రి సమీపంలో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం, డబ్బుల తరలింపుపై దృష్టిసారిచామని ఎస్సై తెలిపరు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

నకిలీ సర్టిఫికెట్ లెక్చరర్ తొలగింపు

ఆసిఫాబాద్‌రూరల్/బెజ్జూర్: నకిలీ సర్టిఫికెట్లతో కాంట్రాక్టు ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేయించుకున్న బెజ్జూర్ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు కలవేణి నాగరాజును ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఐఈవో శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని గత మే నెలలో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2011 నుంచి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్న నాగరాజుపై ఫిర్యాదు రావడంతో విచారణ అనంతరం ఉద్యోగంలోంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

- తెలంగాణ విద్యార్థిపరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

లోకేశ్వరం: ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలన్నారు. విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని కోరారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. విద్యార్థుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట నిర్మల్ పట్టణ కన్వీనర్ జాదవ్ మిథున్ ఉన్నారు.



మాట్లాడుతున్న కొట్టూరి ప్రవీణ్‌కుమార్

ఇసుక లారీ పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా మంచిర్యాల గోదావరి నుంచి జగిత్యాలకు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ పడాల సాయికిరణ్, క్లీనర్ ఎమ్మాజీ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ పట్టివేత

గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వేంపల్లి గ్రామ శివారులోని గోదావరి నుంచి అనుమతులు లేకుండా ఓ ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని బొడ్డు శంకర్, డ్రైవర్ కుర్ర అంజిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పట్టుకున్న లారీతో ఎస్సై

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యాచకుడి మృతి

గుడిహత్నూర్: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాచకుడు కనక నాందేవ్ (77) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంద్రవెల్లి మండలం దేవాపూర్‌కు చెందిన కనక నాందేవ్ మండల కేంద్రంలో యాచిస్తూ జీవిస్తున్నాడు. కాళ్లు పని చేయక పోవడంతో చిన్న చక్రాల బండిలోనే కూర్చొని యాచిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక అండర్ మాస్ పాస్ వద్ద ఉండగా కారు ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.



కనక నాందేవ్ మృతదేహం

చికిత్స పొందుతూ మహిళ మృతి

శ్రీరాంపూర్: ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ ఆర్కే6 గాంధీనగర్‌కు చెందిన అల్లాడి వైష్ణవి (33) మెప్మాలో ఆర్పీగా పనిచేస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.